# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 26 । జూన్ । 2024






**దానిమ్మ.. లాభాల కొమ్మ**

దానిమ్మ సాగులో అధిక దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. - 8లో



**కాపురం చేద్దామంటే కడతేర్చాడు**

జరిగిందేదో జరిగిపోయింది కలిసి కాపురం చేద్దామని వేడుకున్న భార్యను భర్తే కడతేర్చిన ఘటన బి.కొత్తకోట మండలంలో సోమవారం రాత్రి జరిగింది. - 8లో

గరిష్టం/కనిష్టం
37.2 /27.2

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం 27.2 – 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న విజయకుమార్

**బద్వేలు అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. పీఆర్సీ అములులో జాప్యంతో వారు నష్టపోకుండా తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. కూటమి హామీ మేరకు 11వ పీఆర్సీ బకాయిలు, కరవు భత్యం, భవిష్యనిధి, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో దేవానందం, సుధాకర్, శివప్రసాద్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మారెమ్మ సన్నిధిలో అన్నమయ్య వారసులు



మారెమ్మ తల్లి దర్శనానికి వచ్చిన అన్నమయ్య వారసులు

**కడప కల్చరల్:** కడప నగరం ఎర్రముక్కపల్లెలోని మారెమ్మ అమ్మవారిని పద కవితా పితామహుడు అన్నమాచార్య వారసుడు తాళ్లపాక స్వామి కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆయన మార్గమధ్యంలో అమ్మవారి దర్శనం కోసం రావడంతో ఆలయ నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఆయన అమ్మవారి సన్నిధిలో ఆశీనులై అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు భాస్కర్, వనజ, శ్రీనివాసులు, సుశీలమ్మ, రామకృష్ణారెడ్డి, సోమ కళానాథరెడ్డి, సునీల్, రాఘవేంద్రవర్మ, శ్రీనివాసులు, రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న వైవీయూ వీసీ

**వైవీయూ:** ఏపీఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ రెండో రోజునా కొనసాగింది. మంగళవారం నిర్వహించిన మ్యాథమేటిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూతో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి నిపుణులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య ఇంటర్వ్యూ జరిగే తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ 26న గణితం, 27న సైకాలజీ సబ్జెక్టులో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

### ఉత్పత్తి ధరలకే చేనేత వస్త్రాల విక్రయం



వస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుభాషిణి

**కడప కోటిరెడ్డి సర్కిల్:** ఉత్పత్తి ధరలకే వస్త్రాలు విక్రయించేందుకు చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుభాషిణి పిలుపునిచ్చారు. నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళా క్షేత్రంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల కాటన్, పట్టు వస్త్రాలతోపాటు ధర్మవరం, గద్వాల్, ఉప్పాడ, పోచంపల్లి పట్టుచీరలు, మాధవరం, వెంకటగిరి కాటన్ చీరలు, మంగళగిరి డ్రస్ మెటీరియల్, బదరు జరీ చీరలు, షర్టింగ్స్, కలంకార వస్త్రాలు, పొందూరు ఖద్దరుతోపాటు ఇతర వస్త్రాలు అందుబాటులో ఉంచారన్నారు. జులై 1వ తేదీవరకు కొనసాగే ఈ ప్రదర్శనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజారావు, చేనేత సహకార సంఘాలు, కళాకారులు పాల్గొన్నారు.


# గురువుల సర్దుబాటు జరిగేనా?

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బుడి బుడి నడకలతో.. సమదుస్తులతో తరలివచ్చిన పిల్లలతో ఆవరణంతా సందడిగా కనిపిస్తోంది. ప్రతి విద్యా సంవత్సరం బడిలో విద్యార్థుల సంఖ్య మారుతున్నా.. అందుకు తగినట్లు బోధనోపాధ్యాయులు లేరు. గతంలో అత్యధికంగా ఉన్న చోట నుంచి ఇతర పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగినా.. ఈ ఏడాది ఇంకా ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. నూతనంగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం ఇప్పటికి ఎలాంటి జీఓ జారీచేయకపోవడంతో ఉపాధ్యాయవర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.



- పిల్లల సంఖ్యకు తగ్గట్టుగా లేని ఉపాధ్యాయులు
- సర్దుబాటుకు ఉత్తర్వులు ఇవ్వని ప్రభుత్వం
- గత ఏడాది వంద మందికి స్థాన చలనం

**కడప ఎడ్యుకేషన్:** ఈ ఏడాది మే నాటికి వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 39 మంది, ప్రాథమిక పాఠశాల, జడ్పీ పాఠశాలల్లో 528, మున్సిపాలిటీలో 78 మంది కలిపి 645 మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కువ మంది పిల్లలున్న చోట తక్కువ మంది ఉపాధ్యాయులు, తక్కువ మంది పిల్లలున్న చోట ఎక్కువమంది ఉపాధ్యాయులు ఉన్నారు. కొన్ని చోట్ల పని భారం పడుతుండగా, మరిన్నిచోట్ల బోధనకు అవకాశం లేని పరిస్థితి. ఈ విద్యా సంవత్సరం ఇలాగే కొనసాగితే విద్యార్థులు నష్టపోతారనే వాదన బలంగా వినిపిస్తోంది.



ఎర్రగుంట్ల మండలం పొట్లదుర్తి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 714 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 29 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా.. 25 మంది ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

పెద్దముడియం మండలం భీమగుండం హైస్కూల్‌లో 31 మంది పిల్లలు ఉన్నారు. ఇక్కడ మాత్రం ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కొంత మంది మిగులు ఉపాధ్యాయులున్నట్లు తెలిసింది. సర్దుబాటు చేస్తే కొరత తీరే అవకాశం ఉంది.

**సర్దుబాటు జీఓ విడుదల చేయని ప్రభుత్వం**

పాఠశాల పునః ప్రారంభం అనంతరం బోధన సమస్య లేకుండా చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుతం అన్ని తరగతుల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య ఉందా.. లేదా అనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో ఇప్పటికే అధికారులు సేకరించాలి. అవసరమున్న చోట ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి. అయితే టీడీపీ ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా జీఓ విడుదల చేయకపోవడంతో విద్యా శాఖ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి. దీంతోపాటు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించినా.. ముందు టెట్ నిర్వహించాలా లేక నేరుగా డీఎస్సీ జరపాలా అనే విషయంపై సందిగ్ధతలో ఉంది. డీఎస్సీ ద్వారా ఎంపిక ప్రక్రియ ఆలస్యం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లోగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంది.

**గత ప్రభుత్వ హయాంలో సర్దుబాటు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల ఆరంభానికి ముందే విద్యార్థుల బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల నిష్పత్తి చూసుకుని దాదాపు 103మంది ఉపాధ్యాయులను ముందస్తుగా సర్దుబాటు చేసింది. ఇందులో 11 మంది బయాలజీ స్కూల్ అసిస్టెంట్లు, 22మంది ఆంగ్లం, ఆరుగురు హిందీ, 13 మంది మ్యాథ్స్, 12మంది ఫిజికల్ సైన్సు, 21 మంది సోషియల్, 18మంది తెలుగు ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల కొరత తీరి చదువులు సక్రమంగా సాగాయి. ఈ ఏడాది ఇప్పటికీ ప్రక్రియ మొదలు కాలేదు.

**జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు ఇలా...**

| విభాగం | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| ప్రైమరీ స్కూల్స్ | 1601 | 50701 |
| అప్పర్ ప్రైమరీ స్కూల్స్ | 114 | 10310 |
| హైస్కూల్స్ | 243 | 66590 |
| హైస్కూల్ ప్లస్ | 39 | 13598 |
| మొత్తం | 1997 | 141199 |

**మొదటి యూనిట్ పరీక్షల లోగా..**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జులై నెలలో మొదటి యూనిట్ పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఒక్కో సబ్జెక్టు నుంచి రెండేసి పాఠాలు పూర్తిచేయాల్సి ఉంటుంది. పిల్లలు ఎక్కువ... ఉపాధ్యాయులు తక్కువున్న చోట సిలబస్ పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. దీని నుంచి గట్టెక్కేందుకు ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**జీఓ రాగానే సర్దుబాటు చేస్తాం...**



పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన జీవో ఇంకా విడుదల కాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య నిష్పత్తి వివరాలు సేకరిస్తాం. ఎక్కడ ఉపాధ్యాయులు అదనంగా కావాలో, ఎక్కడ అధికంగా ఉన్నారో తెలుసుకుని వెంటనే సర్దుబాటు చేస్తాం.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

### ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించండి

- సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాం
- డీఆర్వో గంగాధర్‌గౌడ్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

**కడప సెవెన్‌రోడ్స్:** జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 2024 సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను పర్యవేక్షణ కమిటీకి నివేదించాలని ఆయన సూచించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల వివరాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జూన్ 29వ తేదీ నుంచి జులై 6వ తేదీ వరకు జిల్లాకు పరిశీలకులు రానున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమ ఖర్చుల వివరాలు, బిల్లులు, బ్యాంకు పుస్తకాలు వెంటనే సమర్పించాలన్నారు. నామినేషన్ తేదీ నుంచి ఎన్నికల ఫలితాల తేదీ వరకు షెడ్యూల్ 1 నుంచి 11 వరకు అన్ని ఖర్చుల వివరాలు ఖచ్చితంగా సరిచూసుకొని అభ్యర్థి సంతకంతో జులై 3వ తేదీలోగా సమర్పించాలన్నారు. నియమావళి 90 ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల లోపు, పార్లమెంట్ అభ్యర్థి రూ.95 లక్షల లోపు ఖర్చు చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి అకౌంట్స్ రిసెప్షన్ టీం(ఏఆర్‌టీ) సిబ్బంది కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నాగరాజారావు, డీసీఓ సుభాషిణి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ మంజులవాణి, డిస్టిక్ కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ సురేష్ కుమార్, ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# పోస్టింగ్ ప్లీజ్..!

- టీడీపీ నేతల వద్దకు తహసీల్దార్లు
- సొంత జిల్లాకు వచ్చేందుకు యత్నం



**కడప సెవెన్‌రోడ్స్:** కోరిన చోట పోస్టింగ్ కోసం అధికారుల ప్రయత్నాలు మొదలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు త్వరలో తిరిగి జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అనుకూల ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం టీడీపీ నేతల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లా కేంద్రమైన కడప, సీకే.దిన్నె, చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి మండలాల్లో పనిచేసేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. భూముల విలువ అధికంగా ఉండడంతో జేబులు నింపుకోవచ్చునని వారు భావిస్తుండడమే ఇందుకు కారణం. గతంలో వేంపల్లెలో పనిచేసిన తహసీల్దారు ఒకరు కడప మండలానికి వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని తెలిసింది. ఇంతకు ముందు కడప జిల్లా సమీపంలోని మండలాల్లో పని చేసి ఇపుడు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఉంటున్న తహసీల్దార్లు మళ్లీ కడప చుట్టుప్రక్కల మండలాలను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

**బదిలీలు సాధారణం**

నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లలో కొందరు తమ అదృష్టం ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో కలెక్టర్ల బదిలీ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ బదిలీలు జరగడం సర్వసాధారణం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సీనియర్ ఐఏఎస్‌లు, మరికొందరు కలెక్టర్లను బదిలీ చేసింది. త్వరలో మరింత మంది కలెక్టర్ల బదిలీలు ఉంటాయంటున్నారు. ప్రస్తుత కలెక్టర్ జిల్లాకు వచ్చి మూడేళ్ల కాలం పూర్తి కానుండడంతో బదిలీ తప్పనిసరి అని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉంటే గతంలో కడప ఆర్డీఓ, డీఆర్వోగా పనిచేసి ఇక్కడే నివాసముంటున్న ఓ అధికారి ఇక్కడికి రావాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద తహసీల్దార్ల పోస్టింగ్‌లపై రెవెన్యూ శాఖలో జోరుగా పైరవీలు మొదలయ్యాయి.

**సిఫారసుల కోసం యత్నాలు**

అధికార పార్టీ నేతల సిఫార్సు ఉంటే తప్ప తాము ఆశిస్తున్న మండలానికి వెళ్లలేమని వారికి తెలుసు. అందుకే టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. కొందరు తహసీల్దార్లు సెలవు పెట్టి మరీ బదిలీ చేయించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యవర్తులు, పరిచయం ఉండే వారితో కలిసి నేరుగా టీడీపీ నేతలను సంప్రదిస్తున్నారు. కొందరు తహసీల్దార్లు నేతల ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అధికారంలో ఎవరుంటే ఆ నాయకుల కను సన్నల్లో పనిచేస్తారనే పేరు వీరికి ఉంది. భూముల వ్యవహారం నుంచి ప్రతిదీ తహసీల్దారు చేతుల మీదుగా జరగాల్సి ఉండడంతో వినయ..విధేయ.. రామ...అన్నట్లు తమ అదుపాజ్ఞల్లో పనిచేసే వారైతే మంచిదే కదా అని అధికార పార్టీ నేతలు కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# డీఎస్సీకి సన్నద్ధం

- టెట్ ఫలితాల విడుదలతో అభ్యర్థుల్లో ఉత్సాహం
- ఉత్తీర్ణత సాధించని వారికి మరో ఛాన్స్

**కడప ఎడ్యుకేషన్:** ఆంధ్రా సివిల్స్‌గా పేరొందిన ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీ–2024 నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర కేబినెట్ 16,347 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అభ్యర్థుల్లో సంతోషం నెలకొంది. గత ప్రభుత్వం నిర్వహించిన టెట్ ఫలితాలు మంగళవారం విడుదల కావడంతో అభ్యర్థులు డీఎస్సీకి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికీ అర్హత సాధించని వారికోసం మరోసారి జూలై 1న టెట్ నిర్వహించనున్నారు. అదే రోజున డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీంతో అభ్యర్థులు కోచింగ్ నిమిత్తం అవనిగడ్డ, కర్నూలు, కడప తదితర ప్రాంతాలకు పయనమయ్యారు.

**ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో 1154 ఖాళీలు**

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో వివిధ ఉపాధ్యాయ కేటగిరీలకు సంబంధించిన 1154 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యా శాఖ వర్గాల సమాచారం. అయితే జిల్లాలో 709 పోస్టుల భర్తీ అంటూ వివిధ మాధ్యమాల్లో సమాచారం వస్తుండగా, అధికారులు మాత్రం నోటిఫికేషన్ వరకు ఖాళీల సమాచారం ప్రకటించలేమని చెబుతుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ఈ పోస్టులకు దాదాపు 30 వేలమంది అభ్యర్థులు పోటీపడే అవకాశం ఉంది. ఈ ఏడాది మే నెల నాటికి ఉన్న ఖాళీలను నోటిఫికేషన్‌లో చూపించనున్నారు.



**ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో ఖాళీలు**

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు : 65
జిల్లా పరిషత్ : 1011
మున్సిపాలిటీ : 78
మొత్తం: 1154



# ఉద్యాన సాగుకు.. ఉపాధి ఊతం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) మొక్కల పెంపకంపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రకృతిలో చెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ భర్తీ పూడ్చేందుకు రాబోయే రోజుల్లో మొక్కల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేసి ఉద్యాన సాగుతో రైతులకు ఉపాధి కల్పించడంపై డ్వామా శ్రద్ధ పెడుతోంది. అర్హత ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది.



ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన దానిమ్మ తోటలో రైతు

- రాయితీలతో ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- 7వేల ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు ప్రణాళిక
- కాల్వలు, రోడ్ల పొడవునా మొక్కల పెంపకం
- ఉపాధి హామీ పథకం కింద రైతులకు సాయం

**కడప సిటీ:** ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు వేల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని డ్వామా లక్ష్యంగా పెట్టుకుంది. క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ఈ ఏడాది పండ్ల తోటల సాగు మరింత విస్తరించేదుకు భారీ ప్రణాళికలు రూపొందించింది. పండ్ల తోటలు, కూరగాయల సాగు, నీటి కుంటలు, ఉద్యాన యాంత్రీకరణ, మల్చింగ్ తదితర పథకాల కింద రాయితీలు ప్రకటించింది. ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పనులు కల్పించడమేగాక, వారి సుస్థిర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టనుంది. అందులో భాగంగా చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న మామిడి, చీనీ, సన్న నిమ్మ,జామ, సపోట, డ్రాగన్ ఫ్రూట్, తదితర 13 రకాల పండ్ల తోటలు పండించేందుకు వంద శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. కొన్ని పంటలకు మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది.

**ఏడు వేల ఎకరాలు లక్ష్యం**

ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద ఏడు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్నదే డ్వామా ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టేందుకు లబ్ధిదారులను గుర్తించారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలు ఉండడంతో రైతులు ఈ పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం అర్హులైన రైతులకు రాయితీ ఇస్తూ చేయూత అందిస్తోంది. జిల్లాలో పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం పరిధిలోని మండలాల్లో చీనీ, సన్న నిమ్మ ప్లాంటేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చి.. మిగిలిన మండలాల్లో మామిడి, చీనీ, సన్న నిమ్మ, తైవాన్ జామ, నాటు జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్‌తోపాటు డ్రాగన్ ఫ్రూట్‌కు కూడా ప్రోత్సాహం అందిస్తోంది. రాయితీ కింద మూడేళ్లపాటు నిర్వహణ ఛార్జీలతోపాటు ఎరువులు, పురుగుల మందులు, దుక్కులు, అంతర్ పంట మొక్కలు, గుంతలు కలిపి సగటున ఎకరాకు మూడు సంవత్సరాలకు రూ.లక్ష వరకు ప్రోత్సాహం అందిస్తోంది. మరో వైపు మునగ సాగుపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అర్హులైన రైతులు మునగ మొక్కలు నాటితే ప్రోత్సాహం అందిస్తోంది.

**బోరు బావి లేకున్నా...**

మెట్ట భూముల్లో (డ్రై ల్యాండ్) హార్టికల్చర్‌లో భాగంగా చీనీ మినహాయించి మిగిలిన పండ్ల తోటలకు రైతుకు బోరు లేదా బావి లేనప్పటికీ హార్టికల్చర్‌లో లబ్ధి పొందే అవకాశం ఉంది. నీటి వసతి లేని రైతులకు నీళ్ల ట్యాంకుల ద్వారా సరఫరా చేసుకునేందుకు ఉపాధి హామీ ద్వారా ఆర్థిక సాయం అందించనుంది.

**దరఖాస్తు చేసుకోవాల్సింది ఇలా..**

అర్హులైన రైతులు జూన్ చివరి వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం నకలు, ఒరిజినల్ 1బీ, ఉపాధి హామీ జాబ్‌కార్డు నకలు, జాబ్‌కార్డులో ఉన్న వారందరి ఆధార్ నకలు, చిన్న, సన్నకారు రైతుల పత్రం, దరఖాస్తు పత్రం అందజేయాల్సి ఉంటుంది. అర్హులు, ఆసక్తిగల రైతులు మండల అభివృద్ధి అధికారి లేదా మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ లేదా గ్రామ ఉపాధి హామి క్షేత్ర సహాయకులను(ఎఫ్ఏ) సంప్రదించవచ్చు.

### గండికోట ప్రాజెక్టు సందర్శన



గండికోట ప్రాజెక్టు సందర్శించిన శిక్షణ ఐఏఎస్ అధికారులు

**కొండాపురం:** గండికోట ప్రాజెక్టును 2023 బ్యాచ్‌కు చెందిన శిక్షణ ఐఏఎస్ అధికారులు మంగళవారం సందర్శించినట్లు జీఎన్ఎస్ఎస్ డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం, ఏయే ప్రాంతాల నుంచి నీళ్లు వస్తాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సందర్శించిన వారిలో సి.హెచ్.కల్యాణి(కర్నూలు), దామెర హిమవంశీ(చిత్తూరు),పవార్ స్వప్నిల్ జగన్నాథ్(గుంటూరు), బొల్లిపల్లి వినుత(అనంతపురం), హెచ్.ఎస్.భావన(కాకినాడ), శుభమ్ నోఖ్వాల్ తదితరులు ఉన్నారు.

**ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న ట్రైనీ ఐఏఎస్‌లు**

**ఒంటిమిట్ట:** ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయాన్ని మంగళవారం సాయంత్రం ఏపీ క్యాడర్‌కు చెందిన 2023 ఐఏఎస్ ట్రైనింగ్ ఆఫీసర్లు ఆరుగురు దర్శించుకున్నారు. వీరిలో సీహెచ్ కల్యాణి, దామెర హిమవంశీ, తావర్ స్వప్నిల్ జగన్నాథ్, బి.వినూత్న, హెచ్ఎస్ భావన, శుభమ్ నూఖ్వాల్‌లకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షణ గావించి గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరు ఆలయ రంగమండపంలో సేదతీరి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## క్లుప్తంగా

### రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు గుర్తు తెలియని వ్యక్తి(30)ని మంగళవారం ఉదయం తీసుకుని వచ్చారు. క్యాజువాలిటీకి తీసుకుని రాగానే డాక్టర్లు అతను మృతి చెందాడని నిర్ధారించారు. అతని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

### హత్య కేసులో నిందితుడి కోసం గాలింపు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వైఎంఆర్‌కాలనీలో ద్వార్శల వెంకట మహేశ్వరరెడ్డిని హత్య చేసిన నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి వెంకట మహేశ్వరరెడ్డిని ముక్కలుగా నరికి శరీర భాగాలను గోనె సంచుల్లో వేసుకొని శివారు ప్రాంతంలో పడేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిగా భావిస్తున్న భూమిరెడ్డి రామచంద్రారెడ్డి పరారీలో ఉన్నాడు. అతని కోసం డీఎస్పీ మురళీధర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. నిందితుడు రామచంద్రారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. తమదైన శైలిలో అతన్ని విచారణ చేస్తున్నారని సమాచారం. హత్య చేయడానికి గల కారణాలను పోలీసులు నిందితుడి నుంచి రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. డబ్బు కోసమే హత్య జరిగినట్లు పోలీసు వర్గాల సమాచారం. కాగా వెంకటమహేశ్వరరెడ్డి మృతదేహానికి మంగళవారం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### అక్కాయపల్లిలో చోరీ



ఇంటిలోని బీరువా తలుపులు తెరిచిన దృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్కాయపల్లి శాస్త్రినగర్‌లో రాజశేఖర్ నివాసం వుంటున్న ఇంటిలో చోరీ జరిగింది. రాజశేఖర్ తన కుటుంబసభ్యులతో సోమవారం అత్తగారింటికి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి గేటు తీసేసి తాళం పగులగొట్టారు. బీరువాలోని దాదాపు 12 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించుకుని వెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై క్లూస్ టీం పరిశీలించింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సమగ్రంగా విచారించి కేసు నమోదు చేయనున్నారు.

# దానిమ్మ.. లాభాల కొమ్మ

- దానిమ్మలో అధిక దిగుబడి
- ఫలితాన్నిచ్చిన నియంత్రకాల వినియోగం
- దోహదపడిన నీరు, ఎరువుల యాజమాన్యం



నరసింహారెడ్డి దానిమ్మ తోటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు



నరసింహారెడ్డి తోటలో కాసిన దానిమ్మ కాయలు



మైదుకూరు : దానిమ్మ సాగులో అధిక దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ దానిమ్మ రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ఉద్యాన పంటల్లో మొక్కలు ఎదుగుదల లేకపోవడం, పూత, పిందె రాలిపోవడం, దిగుబడి ఆశించినంత రాకపోవడం వంటి సమస్యలను అధిగమించేందుకు మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వినియోగించిన నియంత్రకాల ప్రయోగం దానిమ్మపంటపై కూడా విజయవంతమైంది. ఇటీవల సుమన్ కుమార్ అనే రైతు సాగు చేసిన నిమ్మ పంటలో నియంత్రకాల వల్ల అధిక దిగుబడి వచ్చేలా కృషి చేసిన కేవీకే శాస్త్రవేత్తలు ఇప్పుడు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి అనే ఇద్దరు రైతులు దానిమ్మ పంటలో అధిక దిగుబడి సాధించేందుకు నియంత్రకాల ప్రయోగంతో చేయూతనిచ్చారు.

బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లెకు చెందిన నరసింహారెడ్డి పది ఎకరాల్లో, పోరుమామిళ్ల మండలం చెన్నారెడ్డి పేటకు చెందిన సుబ్బారెడ్డి అనే రైతు 5 ఎకరాల్లో దానిమ్మ సాగు చేశారు. ఈ తోటలో మొక్కల పెరుగుదల, పూతపై వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నియంత్రకాల ప్రయోగం నిర్వహించారు. మొక్కల పెరుగుదల నియంత్రకాలైన సైకోసిల్, మెట్రో బెంజిన్‌లను వినియోగించారు. ఒక లీటరు నీటిలో సైకోసెల్ 2.0 మిల్లీలీటర్లు కలిపి మొక్కపై పిచికారి చేశారు. ఈ పిచికారికి ముందు ఇథ్రల్ అనే మరో నియంత్రకాన్ని ఒక లీటరు నీటిలో 2.0 మిల్లీలీటర్లు కలిపి దానితోపాటు డీఏపీ 2.0 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేశారు. దాని వల్ల మొక్కల కొమ్మలకున్న ఆకులన్నీ రాలిపోతాయి. దాంతో మొక్కలు ఒత్తిడికి గురై ప్రొలీన్ అనే అమైనో యాసిడ్ మొక్కల్లో వృద్ధి చెందుతుంది. దాని వల్ల మొక్కలు పూత దశకు చేరుకుంటాయి. ఆకులన్నీ రాలిన తర్వాత మొక్కల కొమ్మల కత్తిరింపులు చేయాలి. ఆ తర్వాత బ్లీటాక్స్ 5.0 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. మొక్కల చుట్టూ పాదులు చేసి వేర్లను కత్తిరించాలి. నీరు, ఎరువులు అందించకుండా ఉంటే మొక్కలు ఒత్తిడికి గురవుతాయి. నెల రోజుల తర్వాత దానిమ్మ మొక్కలకు నీటితోపాటు ఎరువులను కూడా అందించాలి. వారం రోజుల తర్వాత మొక్కల శాఖలను బాగా విస్తరించి పెరుగుతాయి. ఈ సమయంలో మొక్కలకు సైకోసిల్ 2.0 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటితో కలిపి, నైట్రోబెంజిన్ 2.0 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి. ఈ మందులు పిచికారి చేసిన 15 రోజుల తర్వాత పూత బాగా వస్తుంది.

పూతకు వచ్చిన మూడు నెలల తర్వాత కాయలు బాగా కాస్తాయి. నీరు, ఎరువుల యాజమాన్యం బాగా చేస్తే ఒక్కో దానిమ్మకాయ 350–500 గ్రాముల వరకు పెరుగుతాయి. ఈ నియంత్రకాల ప్రయోగంతో సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి అనే రైతులు హెక్టారుకు 18 టన్నుల దిగుబడి సాధించడం విశేషం.



దానిమ్మకాయల దిగుబడి

#### ఆశాజనకంగా దానిమ్మ దిగుబడులు



నియంత్రకాల ప్రయోగంతో సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి అనే రైతులు సాగు చేసిన దానిమ్మ పంటలో దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. మొక్కల ఎదుగుదల లేని పరిస్థితుల్లో ఈ ప్రథమ శ్రేణి ప్రదర్శన నిర్వహించాం. అది ఫలితాన్నిచ్చి రైతులకు లాభసాటి ఆదాయం సమకూరే విధంగా దిగుబడి వచ్చింది. – డాక్టర్ ఎం.బాలకృష్ణ, సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి, కేవీకే, వనిపెంట

#### నియంత్రకాలు, నీటి యాజమాన్యంతో ప్రయోగం



దానిమ్మ సాగులో మొక్కల ఎదుగుదల, పూత పిందె రాలకుండా ఉండేందుకు నియంత్రకాలతో పాటు కాయల పెరుగుదలకు నీరు, ఎరువుల యాజమాన్యంతో ప్రయోగం చేశాం. ఇది మంచి ఫలితాన్ని ఇచ్చింది. సైకోసిల్, నైట్రోబెంజిన్ నియంత్రకాలను పిచికారి చేయడం వల్ల పూత, పిందె నిలిచి మంచి దిగుబడి వచ్చింది.

– డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, వనిపెంట

#### అధిక దిగుబడితో సంతోషం



నేను సాగు చేసిన దానిమ్మ పంటలో అధిక దిగుబడి సాధించడం సంతోషంగా ఉంది. కేవీకే శాస్త్రవేత్తల నియంత్రకాల ప్రయోగంతో ఇది సాధ్యమైంది. ప్రథమ శ్రేణి ప్రదర్శనను నా పొలంలో నిర్వహించినందుకు కేవీకే అధిపతి డాక్టర్ బాలకృష్ణ, ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్‌లకు ధన్యవాదాలు. – నరసింహారెడ్డి, దానిమ్మ రైతు, లింగాలదిన్నెపల్లె, బి.మఠం మండలం.

### పొలంలో డ్రిప్ పరికరాలు అపహరణ

లింగాల : లింగాల మండల కేంద్రంలో సోమవారం రాత్రి పొలంలోని డ్రిప్ పరికరాలు అపహరణకు గురి అయ్యాయి. ఎగువ లింగాలకు చెందిన ఆనందమోహన్ అనే రైతుకు చెందిన రెండు ఎకరాలలోని డ్రిప్ పరికరాలను సోమవారం రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు దొంగిలించుకుపోయారు. సుమారు రూ.30 వేలు విలువ గల డ్రిప్ పరికరాలు తీసుకెళ్లడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పొలం వద్దకు వెళ్లి మంగళవారం పరిశీలించారు. విచారణ చేసి రైతుకు న్యాయం జరిగే విధంగా చూస్తామని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

### వాంతులతో చిన్నారి మృతి



మృతిచెందిన కీర్తి

కడప రూరల్ : కడప నగరం రామరాజుపల్లెలో ఓ చిన్నారి వాంతులతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. రామరాజుపల్లెకు చెందిన చిన్నారి కీర్తి (6) ఉన్న ఫలంగా వాంతులతో మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. చిన్నారి తల్లిదండ్రులైన శ్రీనివాసరావు, నిర్మలాదేవిలతో ఆదివారం ఐటీఐ సర్కిల్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం రామరాజుపల్లెలోని స్వగృహానికి చేరుకున్నారు. తర్వాత కీర్తి మొదటగా ఒకసారి వాంతి చేసుకుంది. అనంతరం అర్ధరాత్రి సమయంలో, సోమవారం తెల్లవారుజామున వాంతులయ్యాయి. దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కాగా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో కడప నగరంలో జరిగిన చిన్నారి మృతితో జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డీఎంహెచ్ఓ నాగరాజు తన బృందంతో రామరాజుపల్లెలో పర్యటించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. కొన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించగా ఎలాంటి పాజిటివ్ రిపోర్టు రాలేదు. డయేరియా అయితే మొదట విరేచనాలు అవుతాయి. అదే డెంగీ అయితే జ్వరం వస్తుంది. ఈ లక్షణాలు ఏమి కనిపించలేదని అధికారులు నిర్ధారించారు. చిన్నారి వాంతులైన 12–13 గంటల వ్యవధిలోనే మరణించింది. సీజనల్ వ్యాధుల కాలంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## 'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని మండల విద్యా శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప జయనగర్‌కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో కడప డివిజన్ పరిధిలోని కడప, ఒంటిమిట్ట, సిద్దవటం మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కడప ఎమ్మార్సీ సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాలలోపు గల పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని జూన్ 13 నుంచి జులై 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నటుల్ పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, గ్రామ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సహకారంతో సీఆర్పీల ప్రోత్సాహంలో ప్రతి ఒక్క విద్యార్థి బడి బయట ఉండకుండా బడిలో ఉండేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా, మండల క్లస్టర్‌స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప మండల ఎంఈఓలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్, సిద్దవటం ఎంఈఓలు విలియంరాజు, అరుణ, ఒంటిమిట్ట ఎంఈఓలు వెంకట సుబ్బయ్య, ప్రభాకర్, సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి, సీఎంఈ మిట్టా కేశవరెడ్డి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

## బేకరి యజమానికి రూ.10 వేలు జరిమానా



బేకరిలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బద్వేలు అర్బన్ : గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయించిన ఓ బేకరి యజమానికి మున్సిపల్ అధికారులు రూ.10 వేలు జరిమానా విధించారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. స్థానిక సిద్ధవటం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల రాజు బేకరిలో సోమవారం ఓ వ్యక్తి తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా కొనుగోలు చేసిన కేక్ బూజు పట్టి కుళ్లిపోయి ఉండటంతో మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మున్సిపల్, సచివాలయ సిబ్బంది బేకరిలో తనిఖీలు నిర్వహించి కుళ్లిన ఆహార పదార్థాలను గుర్తించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సంబంధిత బేకరి యజమానికి రూ.10 వేలు జరిమానా విధించడంతో పాటు హెచ్చరికలు జారీ చేశారు. రాబోవు రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే లైసెన్సు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు..**

పట్టణంలోని హోటళ్లు, బేకరిలు, తోపుడుబండ్లపై తినుబండారాలు విక్రయించే వ్యాపారులు కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ హెచ్చరించారు. ఆహార భద్రత విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే తినుబండారాలను విక్రయించినా, కల్తీ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వ్యాపారులు అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్థాల అమ్మకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన అచ్చన్న

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై నారాయణ రెడ్డిగారిపల్లె సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనం ఢీ కొని అచ్చన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... నారాయణ రెడ్డిపల్లి కస్పాకు చెందిన అచ్చన్న సొంత పనుల నిమిత్తం సమీపంలోని ఓ హోటల్ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా రాయచోటివైపు నుంచి సంబేపల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో అచ్చన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రభుత్వం మారింది... మధ్యాహ్న భోజనం ఆగింది

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం మారగానే రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలంలోని అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆగింది. అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఈనెల 13న పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. అదేరోజు నుంచి రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. అంతే.. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మధ్యాహ్న భోజనం వంట మనిషికి వంట చేయొద్దని చెప్పండి.. అంటూ పాఠశాలలోని ఉపాధ్యాయులకు గ్రామ స్థాయి అధికార పార్టీ నాయకుడు హుకుం జారీ చేశాడు. దీంతో నాలుగు రోజులుగా పాఠశాలలోని విద్యార్థులకు భోజనం కరువైంది. మధ్యాహ్నం వరకు పాఠశాలలో ఉంటూ ఇంటికి వెళ్లి భోజనం తిని రావాల్సిన దుస్థితి నెలకొంది. అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకులు తమ పార్టీకి చెందిన వారు వంట చేస్తారంటూ ఉపాధ్యాయులను ఆదేశించడంతో చేసేదేమీ లేక మిన్నకుండి పోయారు. ఈ విషయమై స్థానిక ఎంఈఓ చక్రనాయక్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు.



### తల్లీ, కుమార్తె ఆత్మహత్యాయత్నం





ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న శారద, లక్ష్మీశైలజ

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శంకరాపురానికి చెందిన దండు శారద (54), కుమార్తె లక్ష్మీ శైలజ(34)లు ఆదివారం తాము ఉంటున్న ఇంటిలోనే చెదలకు కొట్టే మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులైన శారద రిమ్స్‌లో ఎంఐసీయులో ప్రస్తుతం అస్వస్థత నుంచి కోలుకుంటోంది. లక్ష్మీశైలజ మెడికల్ వార్డులో చికిత్స పొందుతోంది. శారద, లక్ష్మీ శైలజ విలేకరులకు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2015లో శారద చిన్నకుమార్తె డి. స్వాతి, ఏఆర్ కానిస్టేబుల్ పవన్‌కుమార్‌ను కులాంతర వివాహం చేసుకుని దూరంగా ఉంటున్నారు. కానిస్టేబుల్ అయిన తన అల్లుడు, తన పెద్ద కుమార్తెతో పాటు తనను తన కుమారుడిని మానసికంగా వేధింపులకు గురి చేస్తుండడంతో తాము ఈ చర్యలకు పాల్పడ్డామని ఆరోపించారు. ఈ సంఘటనపై చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

### కలిసి కాపురం చేద్దామంటే కడతేర్చాడు

బి.కొత్తకోట : జరిగిందేదో జరిగిపోయింది కలిసి కాపురం చేద్దామని వేడుకున్న భార్యను భర్తే కడతేర్చిన ఘటన బి.కొత్తకోట మండలంలోని బి.కొత్తకోట–మదనపల్లె మార్గం జమాలమ్మ దర్గా సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం ఈ ఉదంతం వెలుగు చూడటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలు. బి.కొత్తకోట మండలం పత్రవారిపల్లెకు చెందిన డి.అన్నపూర్ణ (28)కు కర్ణాటకలోని చిక్కబళ్లపూర్ జిల్లా ఎగువకోటకు చెందిన మల్లికార్జున (32)తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు కలిగాడు. తర్వాత ఏమైందో కాని మల్లికార్జున కర్ణాటకకు చెందిన రాధను రెండో వివాహం చేసుకోగా వారికి ముగ్గురు సంతానం కలిగారు. ఇదిలా ఉండగా .. రెండేళ్ల క్రితం అన్నపూర్ణ భర్త మల్లికార్జునను వదిలి పత్రవారిపల్లెలోని పుట్టింటికి వచ్చేసింది. రాధతో మల్లికార్జున కాపురం సజావుగా సాగుతుండగా ఆరు నెలల క్రితం రాధ, తన ముగ్గురు సంతానంలో ఇద్దరితో కలిసి చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో భర్త మల్లికార్జునను నిందితుడిగా చేయడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలులో ఉండిన మల్లికార్జున ఈనెల 18న బెయిలుపై విడుదల అయ్యాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య అన్నపూర్ణ ఉంటున్న పత్రవారిపల్లెకు సోమవారం వచ్చిన మల్లికార్జున ఇకపై కలిసి జీవించడం ఉండదని, ఎవరి జీవితాలు వారు చూసుకోవాలని ఖరాఖండీగా చెప్పేశాడు. ఫోన్‌లో కూడా మాట్లాడవద్దని కోరాడు. దీనికి అన్నపూర్ణ అంగీకరించలేదు. కలిసి జీవిద్దామని పదేపదే ఒత్తిడి చేసినా నిరాకరించాడు. చివరకు అన్నపూర్ణను బైక్‌పై తీసుకుని కర్ణాటకలోని తన స్వగ్రామం ఎగువకోటకు తీసుకెళ్లాడు. అక్కడ ఏమి జరిగిందో కాని తిరిగి బైక్‌పై అన్నపూర్ణతో కలిసి పత్రవారిపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలో కొండకిందపల్లె సమీపంలోని జమాలమ్మ దర్గా వద్ద బైక్ నిలిపి మాట్లాడుకుందామని రోడ్డుకు కొంతదూరంలో అన్నపూర్ణను తీసుకుని వెళ్లాడు. రెండో భార్య రాధ, ఇద్దరు పిల్లల మృతికి అన్నపూర్ణే కారణమని మల్లికార్జున భావించేవాడు. దీనితో అన్నపూర్ణను గొంతు నులిమి చంపేశాడు. మృతదేహాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. మృతురాలి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## పింఛన్ల పంపిణీ సచివాలయ ఉద్యోగులతో సరికాదు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : ఇంతవరకు వలంటీర్లు చేస్తున్న పింఛన్ల పంపిణీ ఇకపై సచివాలయ ఉద్యోగులతో చేయించాలనుకోవడం సరి కాదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 5 లక్షల మంది వలంటీర్లు చేసే పనిని 1.4 లక్షల మంది సచివాలయ ఉద్యోగులతో చేయించాలనుకోవడం అవివేకమన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయాలని సీఎం చంద్రబాబు ప్రభుత్వం చూస్తోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా వలంటీర్లకు నెలకు రూ. 10 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు ఆ వలంటీర్ వ్యవస్థను ఎత్తివేయాలని భావించడం మంచిది కాదన్నారు. గతంలో ఆయన జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి అందులో తెలుగుదేశం కార్యకర్తలకే స్థానం కల్పించారన్నారు. టీడీపీ కార్యకర్తలే జన్మభూమిలో ఉండి కార్యక్రమాలు నిర్వహించేవారన్నారు. పార్టీలకు అతీతంగా ఉన్న వలంటీర్ల వ్యవస్థను తొలగించడం సరికాదన్నారు. వలంటీర్లతోనే పింఛన్ల పంపిణీ చేయించడం మంచిదని గోవిందరెడ్డి పేర్కొన్నారు.



పగిడాల గ్రామంలో చింతచెట్టుపై గబ్బిలాలు

### చింతచెట్టుపై గబ్బిలాలు

గబ్బిలం.. ఊరి చివర చెట్లకు తలకిందులుగా వేలాడే పక్షి లాంటి జీవి. నిజానికి ఇది క్షీర జాతికి చెందినదైనా.. పక్షి తరహా సంచరించే ప్రత్యేక జీవి. ఇవి పగలంతా చెట్లకు వేలాడుతూ.. మేత కోసం రాత్రి సమయాల్లో సంచరిస్తాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆహారాన్ని వేటాడి సూర్యోదయానికి తిరిగి చెట్లపైకి చేరుకుంటాయి. రాజుపాలెం మండలంలోని పగిడాల గ్రామంలోని సచివాలయం వద్ద ఉన్న చింతచెట్లపై 50 ఏళ్లుగా గబ్బిలాలు నివాసం ఏర్పచుకున్నాయి. ఆ క్షీరదాలను సీక్రెట్ పక్షులని గ్రామస్తులు అంటుంటారు. రాత్రివేళల్లో వెళ్లి తిరిగి తెల్లవారేసరికి చెట్టుపైకి చేరుకుంటాయని.. అందుకే వీటిని సీక్రెట్ పక్షులు అని అంటున్నారు. – రాజుపాళెం



చెట్టుపై వేలాడుతున్న గబ్బిలాలు